### అందుబాటులో ఆధునిక సౌకర్యాలు



ముఖ్యంగా కరీంనగర్ రాష్ట్రంలోనే ఒక గొప్పనగరంగా ఎదుగుతున్నది. ఇక్కడి ప్రజలు మెట్రోపాలిటన్ సిటీల్లోని సదుపాయాలు కోరుకుంటున్నారు. మేం కూడా మా సంస్థ నిర్మిస్తున్న గేటెడ్ కమ్యూనిటీ కాలనీలో ప్రజల అభిరుచులకు అనుగుణంగా సదుపాయాలు కల్పిస్తున్నాం. అత్యాధునిక సౌకర్యాలతో నిర్మాణాలు చేపడుతున్నాం.

**- ఉప్పులూరి కృష్ణమూర్తి, ఎడ్‌వెన్స్వా సెంచరీ ఈపీసీ ప్రైవేట్ లిమిటెడ్**

### కట్టెకు బదులుగా యూపీవీసీ



ఇంటి నిర్మాణానికి అవసరమయ్యే కట్టె ధరలు విపరీతంగా పెరిగాయి. దీనికి ప్రత్యామ్నాయంగా యూపీవీసీ వినియోగం పెరిగింది. ప్రజల అవసరాలకు అనుగుణంగా విస్తృత శ్రేణి గ్లేజింగ్ అందుబాటులో ఉన్నాయి. కొత్త భవనాలతోపాటు పాత ఇండ్ల పునరుద్ధరణలో యూపీవీసీ ఉత్పత్తులను వినియోగించవచ్చు. కొనుగోలుదారులు ముందుగా చెబితే ఎలా కావాలో అలా ఉత్పత్తులను అందిస్తాం.

**- పీ మహేందర్, వేకా యూపీవీసీ స్మార్ట్ విండోస్ సొల్యూషన్స్**

### అత్యాధునికంగా విల్లాలు

నగరంలోనే మొట్టమొదటిసారిగా మెట్రో పాలిటన్ సిటీల్లో అత్యాధునిక ప్రమాణాలతో విల్లాలను అందిస్తున్నాం. మేం మల్కాపూర్‌లో నిర్మించిన విల్లాలను ఈ ఏప్రిల్ నుంచి అందుబాటులోకి తెస్తున్నాం. ప్రజల ఇష్టాలకు అనుగుణంగా స్విమ్మింగ్ పూల్, క్లబ్, జిమ్, గార్డెన్‌కు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. వీటితోపాటు అన్ని అనుమతులతో కూడిన వెంచర్లను కూడా ఏర్పాటు చేస్తున్నాం.

**-రాయ్‌చందని సింధ్ డెవలపర్స్, మేనేజింగ్ డైరెక్టర్లు దిలీప్‌కుమార్ మోట్వాని, రాజు మోట్వాని**



# రియల్ జోష్

- కరీంనగర్‌లో ఊపందుకున్న రియల్ ఎస్టేట్ రంగం
- హైదరాబాద్ తరహాలో ఇండ్లు, గేటెడ్ కమ్యూనిటీ నిర్మాణాలు
- ఆధునిక హంగులు.. అధునాతన సదుపాయాలు
- ఆసక్తి చూపుతున్న కొనుగోలుదారులు
- జిల్లాలు వేరైనా ఇక్కడే ఉండేందుకు ఇష్టపడుతున్న ఉమ్మడి జిల్లా ప్రజలు

**కొత్త జిల్లాలు ఏర్పడినా కరీంనగర్ వన్నె ఏమాత్రం తగ్గలేదు. సకల సౌకర్యాలతో నగరం రోజురోజుకూ విస్తరిస్తూనే ఉన్నది. రాష్ట్రంలోనే రెండో నగరంగా ఎదగడం, అభివృద్ధిలో దూసుకెళ్లడం, నలువైపులా ప్రధాన రహదారులు విస్తరించడం, స్మార్ట్‌సిటీ పనులతో రూపురేఖలు మారడం, ప్రశాంత నగరంగా రికార్డులెక్కడం.. ఇలా అనేక కారణాలతో ప్రతి ఒక్కరూ నగర కేంద్రంగా నివాసముండేందుకు ఆసక్తి చూపడం కనిపిస్తున్నది. ఈ నేపథ్యంలోనే రియల్ రంగం పరుగులు పెడుతున్నది. ప్రధానంగా హైదరాబాద్ తర్వాత ఇక్కడే జోరుగా సాగుతున్నది. నగరం చుట్టూ ఎటు చూసినా.. ఇండ్లు, అపార్ట్‌మెంట్లు, విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీల నిర్మాణాలు, వెంచర్లతో హవా కనిపిస్తున్నది.**

కార్పొరేషన్, ఫిబ్రవరి 7 : స్మార్ట్‌సిటీ కరీంనగరం సకల వసతులతో అభివృద్ధి చెందుతున్నది. తెలంగాణలోనే రెండో నగరంగా దూసుకెళ్తున్నది. ఈజీ లీవింగ్ నగరాల్లో రాష్ట్రంలోనే మొదటి స్థానం, దక్షిణ భారత దేశంలో మూడో స్థానం సాధించింది. రోడ్లు, తాగునీరు, పారిశుధ్యం, మౌలిక వసతుల కల్పనతో ప్రజానీకం ఏ ఇబ్బంది లేకుండా నివసిస్తున్నది. విద్య, వైద్య రంగాల్లో ఊహించని ప్రగతి సాధించగా, కేజీ నుంచి పీజీ వరకు విద్యాసంస్థల ఏర్పాటుతో ఎడ్యుకేషన్ హబ్‌గా మారింది. నగరాన్ని ఆనుకొని ఇంజినీరింగ్ కాలేజీలు ఉండగా, మరోవైపు రెండు ప్రైవేట్ మెడికల్ కళాశాలలకు తోడు ప్రభుత్వ మెడికల్ కాలేజీ కూడా ఏర్పాటైంది. ఇలా అన్నింటా సిటీ ముందంజలో ఉండగా.. ప్రతి ఒక్కరూ కరీంనగర్ వైపు చూస్తున్నారు. జిల్లాల పునర్వ్యవస్థీకరణ తర్వాత పూర్వ జిల్లా నాలుగు జిల్లాలుగా విడిపోయినా.. ప్రజలు మాత్రం ఎక్కువగా నగరంలోనే నివాసం ఉండేందుకు ఇష్టపడుతున్నారు. ఉమ్మడి జిల్లా ప్రజలతోపాటు ఇతర జిల్లాల ప్రజలు కూడా ఇక్కడికి వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారు. ఈ ప్రాంతంలో భూములు, ఇండ్లు కొనేందుకు ముందుకు వస్తున్నారు. రోడ్లు బాగుండడం, ప్రశాంత వాతావరణం ఉండడంతో శివారు ప్రాంతాల్లో స్థిర నివాసం ఏర్పరుచుకునేందుకు ఆసక్తి చూపుతున్నారు.

### విస్తరిస్తున్న సిటీ



కరీంనగర్ సిటీ రోజురోజుకూ విస్తరిస్తున్నది. హైదరాబాద్ తర్వాత అభివృద్ధిలో దూసుకెళ్తుండడంతో రియల్ హవా నడుస్తున్నది. జిల్లా కేంద్రంగా ప్రముఖ సంస్థలతోపాటు బిల్డర్లు తమ వెంచర్లు, నిర్మాణాలు చేపడుతుండడంతో వ్యాపారం ఊపందుకుంటున్నది. దీంతో సిటీ నలువైపులా విస్తరిస్తున్నది. కరీంనగర్‌కు వచ్చే ఏ దారిలో చూసినా భారీ అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీల నిర్మాణాలు, ఇండిపెండెంట్ ఇండ్లు, వెంచర్లు కనిపిస్తున్నాయి. నగరం విస్తరిస్తుండడం, రోడ్లు అభివృద్ధి చెందడం, ఏ శివారు నుంచైనా నిమిషాల వ్యవధిలోనే నగరం నడ్డిబొడ్డుకు చేరుకునే అవకాశాలు పెరుగడంతో ప్రజలు కూడా ఆసక్తి చూపుతున్నారు. ప్రశాంత వాతావరణంలోనే తమ స్థిర నివాసం ఉండాలన్న ఆలోచనతో నగరానికి కొంచం దూరంలో ఉన్నా కొనుగోలు చేస్తున్నారు. ఫాం హౌస్‌లు కూడా నిర్మించుకుంటున్నారు. ఈ క్రమంలోనే ప్రజల అభిరుచికి అనుగుణంగా బిల్డర్స్, రియల్ సంస్థల ప్రతినిధులు కూడా సకల సౌకర్యాలతో నిర్మాణాలు చేపడుతున్నారు.

### సకల సదుపాయాలు

అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీ నిర్మాణాల్లో కల్పించే సౌకర్యాలపై ప్రజలు ఎక్కువగా దృష్టి సారిస్తున్నారు. ఒకప్పుడు వాస్తు, నాణ్యత, సుందరంగా భవనం వరకే పరిమితమైనా.. నేడు ఆధునిక హంగులపై ఆసక్తి చూపుతున్నారు. ఇంటి నిర్మాణంతోపాటు ఆయా కాలనీల్లో కల్పించే మౌలిక సదుపాయాలపైనా ఫోకస్ చేస్తున్నారు. దీంతో ఆయా రియల్ వ్యాపార సంస్థల ప్రతినిధులు, బిల్డర్లు మెరుగైన సదుపాయాలను అందుబాటులోకి తెస్తున్నారు. ముఖ్యంగా ప్రతి వెంచర్‌లోనూ విశాలమైన రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, విద్యుద్దీపాలతోపాటు భద్రత కోసం సీసీ కెమెరాలు, స్విమ్మింగ్ పూల్స్, పార్కులు, పార్కింగ్ స్థలం ఇలా ఎన్నో వసతులు కల్పిస్తున్నారు. ఇంటి నిర్మాణాల్లో చూస్తే ఆకట్టుకునేలా నిర్మాణం, మంచి ఫ్లోరింగ్, ఇంటీరియర్ డిజైనింగ్ ఇలా అధునాతన సౌకర్యాలు కల్పిస్తున్నారు. కొన్ని ఇండ్లల్లో స్విమ్మింగ్ పూల్ కోసం ప్రత్యేకంగా స్థలాన్ని ఏర్పాటు చేసి ఇస్తున్నారు. డూప్లెక్స్ ఇండ్లల్లో హైడ్రాలిక్ లిఫ్టింగ్, అలెక్స్, ఆధునిక లాకింగ్ వ్యవస్థలను కూడా అందుబాటులోకి తీసుకువస్తున్నారు.

### సోలార్‌తో ఎంతో లాభం



సోలార్ పవర్ ప్రజలకు ఎంతో లాభదాయకంగా ఉంటుంది. పర్యావరణహితమైన సోలార్ వినియోగాన్ని ప్రజల వద్దకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహిస్తున్నాయి. రాయితీలు ఇస్తూ వినియోగాన్ని పెంచాలని చేయాలని కోరుతున్నాయి. దీంతో ప్రజలు కూడా పర్యావరణ హితమైన సోలార్ వాహనాలవైపు ఆసక్తి చూపుతున్నారు.

**- కోడూరి పర్శరాం గౌడ్, కేకే ఎంటర్‌ప్రైజెస్ సోలార్ సొల్యూషన్స్**

### సోలార్‌పై ఇప్పుడిప్పుడే ఆసక్తి



పెట్రోల్, డీజిల్, బొగ్గు వల్ల పొల్యూషన్ పెరుగుతున్నది. అందుకే పర్యావరణ హితమైన విద్యుత్‌వైపు ప్రపంచం చూస్తున్నది. అందులో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సోలార్ వినియోగాన్ని పెంచేందుకు కృషి చేస్తున్నాయి. రాయితీలు ఇస్తున్నాయి. ప్రస్తుతం సోలార్ బిగింపు కూడా సులువుగానే ఉన్నది. ప్రజలు ఇప్పుడిప్పుడే సోలార్‌వైపు ఆసక్తి చూపుతున్నారు. ఇంకా ముందుకు రావాల్సి ఉన్నది.

**- ప్రశాంత్, సోని సోలార్ పవర్**

### రియల్ రంగానికి మంచి డిమాండ్



నగరంతోపాటు శివారు ప్రాంతాల్లోనూ గృహ నిర్మాణాల ప్లాట్లకు మంచి డిమాండ్ ఉన్నది. ప్రభుత్వ నిబంధనలతో ఉన్న ప్లాట్స్ విషయంలో ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. నగర శివారులో నివాస గృహాలు తీసుకునేందుకు ఇష్టపడుతున్నారు.

**-సాద్ ఉస్మాని, సివిల్ ఇంజినీర్, ఉస్మాని అసోసియేట్స్, కన్స్ట్రక్షన్**

# సొంతూరిపై మమకారం

- జ్యోతిష్మతి చైర్మన్ సాగర్‌రావు ఔదార్యం

చందుర్తి, ఫిబ్రవరి 7: జ్యోతిష్మతి విద్యాసంస్థల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు పుట్టినగడ్డపై మరోసారి మమకారం చాటుకున్నారు. మండలంలోని మూడపల్లిలో సోదరుడు ఆనంద్‌రావు స్మారకార్థం రూ. 4 లక్షలతో మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయించారు. గతంలోనూ తల్లిదండ్రుల పేరిట గ్రామంలో వాటర్ ప్లాంట్‌ను అందుబాటులోకి తెచ్చారు. సర్కారు బడిలో మౌలిక వసతులు కల్పించారు. కాగా, గ్రామంలో వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేయడంపై మాజీ సర్పంచులు చిలుక అంజిబాబు, సంటి బాబురావు, సంటి ఏసుదాస్ సాగర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.



వాటర్ ప్లాంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న గ్రామస్తులు

# మన కరీంనగర్‌లో గ్రాండ్ ప్రాపర్టీ షో

## రేపు, ఎల్లుండి ఏర్పాటు

- రెవెన్యూ గార్డెన్స్ వేదికగా ఎక్స్‌పో
- 'నమస్తేతెలంగాణ'.. 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో నిర్వహణ
- పాల్గొననున్న ప్రముఖ రియల్ సంస్థలు





**లోబడ్జెట్‌లో మీ కలల ఇంటిని కట్టుకోవాలనుకుంటున్నారా..?
ఆధునిక హంగులతో మంచి ఇల్లు కొనాలనుకుంటున్నారా..?
అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ తీసుకోవాలనుకుంటున్నారా..?
ల్యాండ్‌పై ఇన్వెస్ట్ చేయాలనుకుంటున్నారా..?
బ్యాంక్ లోన్ కోసం ట్రై చేస్తున్నారా..?
ఇలాంటి వివరాలన్నీ ఒకే వేదికపై తెలుసుకోవాలనుకుంటున్నారా..?**

**అయితే మన కరీంనగర్‌లో రేపు, ఎల్లుండి నిర్వహించే ప్రాపర్టీ షోకు రండి! మీ అనుమానాలను నివృత్తి చేసుకోవడమే కాదు, మీకు అనుకూలమైన ప్రాంతంలో ఇల్లు, విల్లాలు, అపార్టుమెంట్లను ఎంచుకోండి!**

కార్పొరేషన్, ఫిబ్రవరి 7 : 'నమస్తే తెలంగాణ', 'తెలంగాణ టుడే' ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో కరీంనగర్ వేదికగా ప్రాపర్టీ షో నిర్వహిస్తున్నారు. స్థానిక కలెక్టరేట్ ఎదుట ఉన్న రెవెన్యూ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన ఈ ఎక్స్‌పోను శుక్రవారం ఉదయం 9 గంటలకు ప్రారంభించి, శనివారం రాత్రి 7గంటలకు ముగించనున్నారు. రెండు రోజులపాటు జరిగే ఈ ప్రోగ్రాంలో రియల్ ఎస్టేట్ రంగానికి సంబంధించిన ప్రముఖ సంస్థలు, అలాగే రుణ సౌకర్యం కల్పించే పలు బ్యాంకులు పాల్గొననుండగా, ప్రజలందరికీ ఉచిత ప్రవేశం కల్పించారు. ఇల్లు కొనాలనుకునే ప్రతి ఒక్కరికీ ఈ వేదిక ఒక వరంగా మారనున్నది. నిర్మాణ రంగం గురించి ఒకే వేదికపై సకల సమాచారం తెలుసుకునే అవకాశమున్నది. ఈ ప్రాపర్టీ షో కు సంబంధించిన మరింత సమాచారం కోసం 9182777571, 9182777572 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఈశ్వర్, వేదికపై మాజీ స్పీకర్ మధుసూదనాచారి, జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత, డీసీఎమ్మెస్ చైర్మన్ డాక్టర్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు

# మోసపోయి గోసపడుతున్నరు

- కాంగ్రెస్ ఆరుగ్యారెంటీలపై ఆ పార్టీ నాయకులను నిలదీయాలి
- పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే ఘన విజయం
- నాయకులు, కార్యకర్తలు నిబద్ధతతో పనిచేయాలి
- మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్
- ధర్మపురిలో బీఆర్‌ఎస్ నియోజకవర్గ స్థాయి సమావేశం

ధర్మపురి, ఫిబ్రవరి 7 : 'కాంగ్రెస్ అబద్ధపు హామీలతో ప్రజలు మోసపోయి గోసపడుతున్నరు.. ఆరు గ్యారెంటీలపై ఆ పార్టీ నాయకులను గ్రామగ్రామాన నిలదీయాలి. కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలి. బీఆర్‌ఎస్ కార్యకర్తలు ఆత్మస్థైర్యాన్ని కోల్పోవద్దు. ప్రజల పక్షాన నిలబడి పోరాడాలి. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌దే ఘన విజయం. గత ఎన్నికల్లో జరిగిన తప్పులను సరి చేసుకొని నిబద్ధతతో పనిచేయాలి' అని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పిలుపునిచ్చారు. బుధవారం ధర్మపురిలోని నృసింహ గార్డెన్స్‌లో నిర్వహించిన బీఆర్‌ఎస్ నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల సమావేశంలో పార్టీ రాష్ట్ర పరిశీలకుడు, మాజీ స్పీకర్ మధుసూదనాచారితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పదేళ్ల కేసీఆర్ పాలనలో దేశానికే ఆదర్శంగా నిలిచిన తెలంగాణ ప్రస్తుత పాలనలో దిక్కుతోచని స్థితిలో ఉందన్నారు. కేసీఆర్ ప్రభుత్వంపై అర్థంలేని ఆరోపణలు చేస్తూ నెట్టుకువస్తున్నారని ఆరోపించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలను గాలికి వదిలి టీఎస్‌ను టీజీగా, తెలంగాణ తల్లి విగ్రహానికి మార్పులు చేయడానికి ప్రాధాన్యతనివ్వడం విడ్డూరమన్నారు. రూ.6 లక్షల కోట్ల అప్పులు చూపి అబాసుపాలు చేసే ప్రయత్నం చేస్తున్నారే కానీ, రూ.50 లక్షల కోట్ల ఆస్తులు ఎందుకు చూపడంలేదని ప్రశ్నించారు. ఈ పదేళ్లలో రాష్ట్రంలో 23 ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని, వీటి ఆధారంగా కోటి 20 లక్షల హెక్టార్లకు సాగునీరందిందని, ఇవ్వన్నీ ప్రజలు గమనించాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎప్పటికప్పుడు కాంగ్రెస్ కుట్రలను తిప్పికొట్టాలని, రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించుకుందామని పిలుపునిచ్చారు. కాగా, ఈ సందర్భంగా పెద్దపెల్లి బీఆర్‌ఎస్ ఎంపీ టికెట్ మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌కే ఇవ్వాలని ఏకగ్రీవ తీర్మానం చేస్తున్నట్లు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రకటించారు. సమావేశంలో కరీంనగర్ డీసీఎమ్మెస్ చైర్మన్ డాక్టర్ ఎల్లాల శ్రీకాంత్‌రెడ్డి, రాష్ట్ర నాయకులు ఓరుగంటి రమణారావు, ఎంపీపీలు చిట్టిబాబు, లక్ష్మి, జడ్పీటీసీలు అరుణ, కరుణశ్రీ, మున్సిపల్ చైర్‌పర్సన్ సంగి సత్తెమ్మ, రైతుబంధు సమితి మండల కన్వీనర్ సొల్ల భీమయ్య, ఏఎంసీ చైర్మన్ రాజేశ్‌కుమార్ తదితరులున్నారు.

### అబద్ధాలతో కాలం వెల్లదీస్తున్న కాంగ్రెస్

అప్పులు చేయడం.. సంపద సృష్టించడం.. పేదలకు పంచడం అనేది కేసీఆర్ ప్రభుత్వానికి మాత్రమే తెలుసు. పైసా అప్పు తేకుండా అభివృద్ధి ఎలా సాధ్యమో దమ్ముంటే నిరూపించాలి. ప్రభుత్వ ఫలాలు ప్రజలకు అందించాలనే చిత్తశుద్ధి కాంగ్రెస్ ప్రభుత్వానికి లేదు. అంతులేని, ఆచరణ సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను నమ్మించేందుకు పచ్చి అబద్ధాలు చెబుతూ కాలం వెల్లదీస్తున్నది. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకోవాల్సిన అవసరం ఉంది.

**-మధుసూదనాచారి, రాష్ట్ర పరిశీలకుడు, మాజీ స్పీకర్**

### బీఆర్‌ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపిద్దాం

రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపించుకుందాం. పార్టీ అధినేత కేసీఆర్ సూచించిన అభ్యర్థి గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలి. అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మపురి కాంగ్రెస్ అభ్యర్థి ఏడుస్తున్నడని ప్రజలు నమ్మి ఓట్లు వేసి గెలిపించారు. కానీ, ఇప్పుడు ప్రజలు ఏడ్చే పరిస్థితులు వచ్చాయి. ప్రజల కష్టాలు పోవాలంటే బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిద్దాం.

**- దావ వసంత, జగిత్యాల జడ్పీ చైర్‌పర్సన్**

# క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించాలి

- అలాంటప్పుడే వందశాతం నయం చేయొచ్చు
- భవిష్యత్‌లో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తాం
- పిమ్స్ ప్రొఫెసర్ డాక్టర్ బోయినపల్లి మాధవి



మాట్లాడుతున్న ప్రొఫెసర్ డాక్టర్ మాధవి

విద్యానగర్, ఫిబ్రవరి 7: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తిస్తే వందశాతం నయం చేసే అవకాశం ఉందని ప్రతిమా మెడికల్ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ బోయినపల్లి మాధవి సూచించారు. ప్రతిమ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్, చల్మెడ క్యాన్సర్ ఇనిస్టిట్యూట్ సహకారంతో మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 4 నుంచి నగరంలోని టీటీడీ కల్యాణమండపంలో నిర్వహించిన మహిళలకు క్యాన్సర్‌పై ఉచిత అవగాహన, స్క్రీనింగ్ పరీక్షల వైద్య శిబిరం బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. నాలుగు రోజులపాటు జరిగిన శిబిరానికి అపూర్వ స్పందన లభించిందని, 846 మంది హాజరయ్యారని చెప్పారు. ఇందులో పాప్ స్మియర్ పరీక్షకు 486 మంది, థోనోగ్రఫీకి 316 మంది, కాల్పస్కోపికి 63 మంది, అమోగ్రఫీకి 116 మంది వచ్చినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని శిబిరాలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పిస్తానని చెప్పారు. వైద్య పరీక్షల రిపోర్టులు ఈ నెల 11న వస్తాయని, అవి రాగానే ఫలితాలను ఇస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చల్మెడ, ప్రతిమా వైద్యులు, సిబ్బంది, బోయినపల్లి మాజీ ఎంపీపీ సత్తినేని భాగ్యలత, తదితరులు పాల్గొన్నారు.

